ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 273 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం జనవరి 12 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## సంక్రాంతి ఎఫెక్ట్..
### మటన్ కేజీ రూ.800..
### నాటు కోడి కేజీ ధర రూ.2,500..

హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం)

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ వేళ నాటుకోడి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. పండుగ రోజుల్లో నాటుకోడి మాంసం వండుకోవడం సంప్రదాయంగా వస్తుండటంతో వీటికి భారీ గిరాకీ ఏర్పడింది. ఏపీకి ఆనుకొని ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు.. ఏపీలోని గోదావరి జిల్లాల్లో నాటుకోడి ధర రికార్డు స్థాయిలో రూ. 2 వేల నుండి రూ. 2,500 వరకు పలుకుతున్నాయి. మటన్ ధర రూ. 800 ఉండగా.. నాటుకోడి ధర దాన్ని మించిపోవడం గమనార్హం. ఉత్పత్తి తగ్గడం, పెంపకం చేసే రైతుల సంఖ్య పరిమితంగా ఉ ఒడటమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం.

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలవ్వకముందే నాటుకోడి మాంసానికి గిరాకీ అమాంతం పెరిగింది. పండుగ రోజుల్లో నాటుకోడి వండుకోవడం ఒక సంప్రదాయంగా వస్తున్నందున.. మార్కెట్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది ఉత్పత్తి తగ్గడం, పెంపకం చేసే రైతుల సంఖ్య పరిమితంగా ఉండటంతో నాటుకోడి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరాయి.

అందుతున్న సమాచారం ప్రకారం.. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లో.. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నాటుకోడి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. పందెం పుంజులు, మేలు రకం నాటుకోళ్ల ధర కేజీ రూ. 2,000 నుండి ..మిగతా 2లో

## ఇందిరమ్మ ఇళ్లు.. ప్రతివారం
# బిల్లులు మంజూరు: భట్టి
### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త
### ఇక నుంచి బిల్లులు ఆలస్యం లేకుండా.. వెంటనే అకౌంట్లోకి..
### రామగుండం పర్యటనలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




రామగుండం జనవరి 11 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రామగుండం పర్యటనలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునే కొద్దీ విడతల వారీగా నిధులు మంజూరు చేస్తామని, ప్రతి వారం బిల్లులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ.. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. దీనితో పాటు రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా వంటి కీలక హామీలను ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో సొంతింటి కల కలిగిన పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక స్పష్టత ఇచ్చారు. రామగుండం పర్యటనలో భాగంగా మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ఆయన పలు ..మిగతా 2లో

## కోమటిరెడ్డికి తెలియకుండానే సినిమా టికెట్ రేట్లపై జీవోలు
### సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని మరిచారని ఆరోపణ
### టికెట్ల దందా వెనుక ఓ రాజ్యాంగేతర శక్తి ఉందని సంచలన వ్యాఖ్యలు
### ఈ వ్యవహారంపై గవర్నర్ విచారణ జరపాలని డిమాండ్
### రేవంత్ నడుపుతోంది సర్కారా? సర్కస్ కంపెనీనా? హరీశ్ రావు ఫైర్



హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం)

తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఒక శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తికి తెలియకుండానే ఆ శాఖలో కీలక నిర్ణయాలు జరిగిపోవడం, జీవోలు విడుదల కావడం దారుణమని ..మిగతా 2లో



బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ దంపతులను బి ఆర్ ఎస్ లోకి స్వాగతిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ బి ఆర్ ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి

### అలివి కాని హామీలు ఇచ్చి
## కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది
### మాజీ మంత్రి కేటీఆర్

రాజేంద్రనగర్, జనవరి 11 (ప్రభాత ఉదయం)

కాంగ్రెస్ పార్టీ అలివి కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు.పదేళ్లు తెలంగాణపై ఇష్టంతో పనిచేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.2014కు ముందు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది..కేసీఆర్ వచ్చాక ఎలా మారిందో గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య మాజీమంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ బి ఆర్ ఎస్ ఇంచార్జ్ పి కార్తీక్ రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ చేరిన సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ స్వాగతించారు.హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. శ్రీలత ప్రేమ్ గౌడ్ దంపతులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కరెంట్ సమస్యలు పరిష్కరించి..అందరికీ నాణ్యమైన విద్యుత్ అందజేశారని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలు,పార్కులు కట్టుకున్నామని పేర్కొన్నారు.మన రాష్ట్రం,మన ప్రజల కోసం పనిచేశామనిచెప్పారు.కరోనా సమయంలో కూడా 40 లింక్ రోడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు.ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కేసీఆర్ వినియోగించుకున్నారని అన్నారు.ప్రజలకు అలివికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని అన్నారు.

కేసీఆర్ ప్రజలకు ..మిగతా 2లో



### ధరణిలోని లొసుగులతో అక్రమాలకు పాల్పడిన వారిని
## వదిలిపెట్టేది లేదు
### రాష్ట్రవ్యాప్తంగా ఆడిటింగ్ నిర్వహిస్తాం
### భూభారతి పోర్టల్‌లో అక్రమాలకు కళ్లెం
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం)

ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం నాడు మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన మంత్రి పొంగులేటి రాష్ట్రంలోని జనగాం తదితర ప్రాంతాల్లో బయటపడిన స్టాంప్ డ్యూటీ సొమ్ము చెల్లింపుల్లో అక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా మొత్తం 52 లక్షల లావాదేవీలలో 4,800 లోపాలు గుర్తించామని తెలిపారు. వీటిలో దాదాపు 3000 లోపాలు ..మిగతా 2లో

## టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్
### తొలి తెలుగు వ్యక్తిగా చరిత్ర సృష్టించిన పవన్ కల్యాణ్
### పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' బిరుదు
### జపాన్ షింగెన్ క్లాన్‌లో ప్రవేశించిన తొలి తెలుగు వ్యక్తిగా అరుదైన ఘనత
### యుద్ధ కళ 'కెంజుట్సు'లో 5వ డాన్ పురస్కారం
### మూడు దశాబ్దాల సాధనకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు




హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యుద్ధ కళల్లో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. జపాన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఆయనకున్న అసాధారణ నైపుణ్యానికి గుర్తింపుగా గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదును ప్రదానం చేసింది.

ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు'లో పవన్ నైపుణ్యానికి జపాన్‌కు చెందిన 'సోగో బుడో కన్‌రి కై' సంస్థ ఫిఫ్త్ డాన్ (ఫిఫ్త్ డాన్) పురస్కారాన్ని అందించింది. అంతేకాకుండా, జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'కి చెందిన 'టకెడా షింగెన్ క్లాన్'లో ఆయనకు ప్రవేశం లభించింది. ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ మార్గదర్శకత్వంలో 'కెండో'లో కూడా ఆయన ఉన్నత స్థాయి శిక్షణ పొందారు.

చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆసక్తి పెంచుకున్న పవన్, ..మిగతా 2లో

# కోమటిరెడ్డికి తెలియకుండానే సినిమా టికెట్ రేట్లపై జీవోలు

మొదటి పేజీ తరువాయి...

విమర్శించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు జీవో బయటకు వస్తే, ఆ శాఖ మంత్రి అయిన కోమటిరెడ్డి 'నాకు తెలియదు, నా దగ్గరికి ఫైల్ రాలేదు' అని నిస్సహాయత వ్యక్తం చేయడం ప్రభుత్వంలో పాలన ఏ స్థాయిలో ఉందో చెబుతోందన్నారు. "శాఖ ఒకరిది, పెత్తనం మరొకరిది అన్నట్లుగా ఉంది. పలు శాఖలకు తానే మంత్రినని చెప్పుకొనే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో ఏం జరుగుతుందో తనకు సంబంధం లేదనడం విడ్డూరం. టికెట్ల రేట్ల పెంపు సీఎం నిర్ణయమేనని ఆయన చెప్పకనే చెబుతున్నారు. అంటే, సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా లేనట్టా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. "రేవంత్ రెడ్డి గారు, మీరు నడుపుతోంది సర్కారా లేక సర్కస్ కంపెనీనా?" అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా తాను సీఎంగా ఉన్నంతకాలం టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని, మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సభను,




ప్రజలను ఇంత నిస్సిగ్గుగా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం సినీ పరిశ్రమపై రాజకీయ కక్ష సాధిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. "పాలకుడు పాలసీతో ఉండాలి కానీ, పగతో ఉండకూడదు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్షగడతారు. మీ పేరు మరిచినందుకు మరో హీరోను జైలుకు పంపుతారు. ఇప్పుడు మీకు నచ్చిన వారికి రూ. 600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తారా?" అని ప్రశ్నించారు.

"గత పదేళ్లు కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎక్కడా వివక్ష చూపలేదు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయి. 50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు. ప్రభుత్వమంటే అందరినీ సమానంగా చూడాలి. ఒకరికి చుట్టం .. మరొకరికి శత్రుత్వం ఉండకూడదు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు. ఇది ప్రజా పాలన కాదు.. ఇది మీ పాపిష్టి పాలన కు పరాకాష్ఠ. మొన్న ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో? ఒక్కో సినిమాకు కమీషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో?.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతాం" అని అన్నారు.

సినిమా టికెట్ల రేట్ల కమీషన్ల దందాపై గవర్నర్ తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు.



## ఇందిరమ్మ ఇళ్లు.. ప్రతివారం బిల్లులు మంజూరు: భట్టి

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త చెబుతూ.. నిర్మాణ దశల వారీగా నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే విడుదల చేస్తామని ప్రకటించారు.

పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. సొంత స్థలం కలిగిన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోంది. ఇళ్ల నిర్మాణం ఎంత వేగంగా పూర్తయితే అంత త్వరగా నిధులు మంజూరు చేస్తామని భట్టి విక్రమార్క(దీష్ఠ్రఖ్ఱ ఎఱఎతీఖుఋతీఝు) తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ప్రతి వారం బిల్లులు విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో ఎలాంటి ఆలస్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించామని.. ఇందుకోసం ప్రభుత్వం దాదాపు 22,500 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని వెల్లడించారు.

కేవలం గృహ నిర్మాణమే కాకుండా.. పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం అభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వస్తుందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా.. సింగరేణిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వ హయాంలో పురుగుల బియ్యం పంపిణీ చేసేవారని.. ప్రస్తుతం తాము సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే.. పాలకుర్తి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో 175 కోట్ల రూపాయల విలువైన పనులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం.. స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని మోడల్ సిటీగా మారుస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు.

## టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్

మొదటి పేజీ తరువాయి...




మూడు దశాబ్దాలుగా క్రమశిక్షణతో సాధన చేస్తున్నారు. చెన్నైలో కఠిన శిక్షణ తీసుకోవడమే కాకుండా, జపనీస్ సమురాయ్ యుద్ధ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేశారు. తన సినిమాలలో యుద్ధ కళలను ప్రదర్శించి, వాటికి తెలుగునాట విస్తృత ప్రజాదరణ కల్పించారు.

ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, సినిమాల్లోనూ కొనసాగుతున్నారు. ఆయన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్ణ విడుదలకు సిద్ధమవుతుండగా, సురేందర్ రెడ్డి దర్శకత్వంలో మరో చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ అంతర్జాతీయ పురస్కారం యుద్ధ కళల పట్ల పవన్‌కు ఉన్న అంకితభావానికి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

అసలేమిటీ కెంజెట్సు...?

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జపాన్‌కు చెందిన ప్రాచీన యుద్ధకళ 'కెంజుట్సు'లో 5వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. ఈ ఘనతతో ఆయన తెలుగువారికి గర్వకారణంగా నిలిచారు. ఈ నేపథ్యంలో, అసలు కెంజుట్సు అంటే ఏమిటి? దాని చరిత్ర, ప్రత్యేకతలు ఏమిటో వివరంగా తెలుసుకుందాం.

కెంజుట్సు అనేది జపనీస్ భాషలో 'కత్తి విద్య' లేదా 'కత్తి నైపుణ్యం' అని అర్థం. ఇది కేవలం ఒక క్రీడ కాదు, ఒకప్పుడు సమురాయ్ యోధులు యుద్ధభూమిలో ప్రాణరక్షణ కోసం, శత్రువులను ఎదుర్కోవడానికి ఉపయోగించిన వాస్తవ పోరాట పద్ధతుల సమాహారం. ఈ యుద్ధకళ జపాన్ సాంప్రదాయ యుద్ధ విద్యలలో (కో-బుడో) అత్యంత కీలకమైనదిగా గుర్తింపు పొందింది.

ఈ కళకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. జపాన్‌లో కమకురా కాలంలో (1192-1333) జరిగిన అంతర్యుద్ధాల సమయంలో కెంజుట్సు ఒక ప్రధాన యుద్ధ విద్యగా అభివృద్ధి చెందింది. మురోమాచి కాలంలో 'టెన్షిన్ షోడెన్ కటోరి షింటో-ర్యూ' వంటి మొట్టమొదటి శిక్షణా కేంద్రాలు (స్కూల్స్) ఏర్పడ్డాయి. ఎడో కాలం (1603-1868) వచ్చేసరికి 500కు పైగా స్కూల్స్ వెలిశాయి. అయితే, 1868లో మెయిజీ పునరుద్ధరణ తర్వాత సమురాయ్ వ్యవస్థ అంతరించిపోవడంతో కెంజుట్సు ప్రాబల్యం తగ్గింది. దీని నుంచే ఆధునిక క్రీడ అయిన 'కెండో' పుట్టింది.

కెంజుట్సు శిక్షణలో ప్రధానంగా 'కటానా' (పొడవాటి కత్తి) ఉపయోగిస్తారు. సాధన కోసం 'బోకెన్ణ (చెక్క కత్తి) వాడతారు. ఇందులో కత్తిని అడ్డంగా, నిలువుగా, వాలుగా నరకడం (కిరి), పొడవడం (ట్సుకి), దాడులను అడ్డుకోవడం (ఉకె) వంటి అనేక పద్ధతులు ఉంటాయి. శిక్షణ ప్రధానంగా 'కటా' రూపంలో ఉంటుంది. అంటే, ఇద్దరు వ్యక్తులు ముందుగా నిర్దేశించిన పద్ధతిలో దాడి, ప్రతిదాడి చేస్తూ సాధన చేస్తారు. ఇది నిజమైన పోరాటాన్ని తలపిస్తుంది.

చాలామంది కెంజుట్సును కెండో, ఇయాయిడోలతో పోల్చి గందరగోళానికి గురవుతారు. కెంజుట్సు ప్రాచీన యుద్ధ పద్ధతులపై దృష్టి సారిస్తే, కెండో అనేది సురక్షితమైన ఆధునిక క్రీడ. ఇక ఇయాయిడో అనేది ఒర నుంచి కత్తిని వేగంగా తీసి దాడి చేసే కళ. కెంజుట్సు కేవలం శారీరక శిక్షణ మాత్రమే కాదు, మానసిక క్రమశిక్షణ, ఏకాగ్రత, గౌరవం, ధైర్యం వంటి 'బుషిడో' (సమురాయ్ నియమావళి) సూత్రాలను కూడా నేర్పుతుంది. అటువంటి అరుదైన, గౌరవనీయమైన యుద్ధకళలో పవన్ కల్యాణ్ ఉన్నత స్థాయికి చేరుకోవడం ఆయన వ్యక్తిగత పట్టుదలకే కాకుండా, ఈ కళ పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం.



## సంక్రాంతి ఎఫెక్ట్..

మొదటి పేజీ తరువాయి...

రూ. 2,500 వరకు పలుకుతోంది. కొన్ని ప్రాంతాల్లో పందాలకు ఉపయోగించే కోళ్లకు ఇంకా ఎక్కువ ధర లభిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పందెం కోళ్లను పెంచుతూ ఉంటారు. వీటి ధరలు రూ.లక్షల్లో ఉండటం గమనార్హం. ఇక హైదరాబాద్ వంటి నగరాల్లోనూ కేజీ నాటుకోడి ధర రూ. 600 నుండి రూ. 1,000 వరకు విక్రయిస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ప్రస్తుతం మటన్ ధర కేజీ రూ. 800 నుండి రూ. 900 ఉండగా.. నాటుకోడి ధర దానిని కూడా దాటేసింది. ప్రస్తుతం గ్రామాల్లో నాటుకోళ్లు దొరకడమే కష్టంగా మారింది. పండుగ అవసరాల కోసం ప్రజలు నెల రోజుల ముందే గ్రామాల్లో ఆరా తీసి వీటిని బుక్ చేసుకుంటున్నారు. పందెం పుంజుల కంటే రుచి పరంగా పిట్టలకే ఎక్కువ గిరాకీ ఉంటోంది. అందుకే చాలా చోట్ల కోడి పిట్టల కొనుగోలుకు వినియోగదారులు పోటీ పడుతున్నారు. నాటుకోడి ధరలు చుక్కలు చూపిస్తున్నప్పటికీ.. సాధారణ బ్రాయిలర్ చికెన్ ధరలు మాత్రం కొంతవరకు స్థిరంగా ఉన్నాయి.

ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, వరంగల్ వంటి నగరాల్లో స్కిన్‌లెస్ చికెన్ ధర కేజీ రూ. 300 నుండి రూ. 320 మధ్య కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో రూ. 260 నుండి రూ. 280 వరకు లభిస్తోంది. గతంలో ప్రతి ఇంట్లో నాటుకోళ్లు పెంచేవారు.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేవలం కొన్ని పౌల్ట్రీ ఫారాల్లో మాత్రమే నాటుకోళ్లను పెంచడం వల్ల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడింది. పండుగ రోజున బ్రాయిలర్ చికెన్ కంటే నాటుకోడి తినడానికే జనం ఆసక్తి చూపడం వల్ల ముమ్ముందు ఈ ధరలు మరికొంత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



## ధరణిలోని లొసుగులతో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదు

మొదటి పేజీ తరువాయి...

రంగారెడ్డి ,యాదాద్రి జిల్లాల్లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన మొత్తాన్ని తప్పకుండా రికవరీ చేస్తామని తెలిపారు.రెవెన్యూ యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన ఆడిటింగ్. లో భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు చెల్లించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చలాన్ సొమ్మును పక్కదారి పట్టిన విషయాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌లో ఆడిటింగ్ విధానం లేకపోవడమే ఇలాంటి అక్రమాలకు ప్రధాన కారణమని ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి, లోతైన విచారణ జరిపించి బాధ్యులెవరో తేల్చి చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు.ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా లేదా అన్న అంశంపై కూడా లోతైన విచారణ జరపాలని, ఎవరైనా తప్పు చేసినట్టు తేలితే ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు.ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన నాటి నుంచి గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అన్ని లావాదేవీలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ప్రభుత్వానికి రావలసిన ఒక్క పైసా సొమ్ము దుర్వినియోగం చేసినా సహించేది లేదని స్పష్టమైన హెచ్చరిక చేశారు. ప్రజల సొమ్ముతో ఆడుకున్న వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటి అక్రమాలకు ఇకపై తావు ఉండదని మంత్రి స్పష్టం చేశారు

# అలివి కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది

మొదటి పేజీ తరువాయి...

మంచి చేశారు కాబట్టే ఆయన్ను ప్రజలు మరిచిపోలేకపోతున్నారని కేటీఆర్ తెలిపారు.కేసీఆర్ చేసిన అభివృద్ధితో భూముల ధరలు పెరిగాయని అన్నారు.అప్పట్లో రూ.5లక్షలు ఉన్న భూమి..30 నుంచి 50లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ స్తంభించిందని పేర్కొన్నారు.రెండేళ్లలో రియల్ ఎస్టేట్‌ను తొక్కిపెట్టాడని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో భూముల రేట్లు తగ్గాయని అన్నారు.కళ్ల ముందటే ప్రజల ఆస్తి కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆస్తులు,బంగారం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని రేవంత్ ఆరోజే చెప్పాడని అన్నారు.

**రేవంత్‌కు వచ్చింది బూతుల భాష ఒక్కటే..**

ప్రజలకు అలివికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని అన్నారు.అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని అన్నారు. దేవుళ్లు,



సోనియాగాంధీ,రాహుల్ గాంధీపై ఒట్టు వేసి ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పాడని తెలిపారు.కేసీఆర్ 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చాడని తెలిపారు.కేసీఆర్ రైతుబంధుతో అగ్రవర్ణాలకు కూడా మేలు జరిగిందని అన్నారు.రైతు సంపద పెరిగితేనే అన్ని వర్గాలు ఆనందంగా ఉంటాయని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000 చేశారని తెలిపారు.పెన్షన్ ఏమైందని అడిగితే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రేవంత్




రెడ్డికి వచ్చింది ఒకటే భాష..

అది బూతుల భాష అని ఎద్దేవా చేశారు. లాగుల్లో తొండలు ఇడుస్తా.. పేగులు తీసి మెడలో వేసుకుంటానని అంటారని అన్నారు.బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.2.80 లక్షల కోట్లే

రాష్ట్రం అప్పుల పాలైందని రేవంత్ రెడ్డి పదే పదే అంటాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అప్పుపై ఒక్కోకాంగ్రెస్ నేత ఒక్కోలా మాట్లాడతారని అన్నారు. ఒకరు రూ.6లక్షల కోట్లు,మరొకరు 7లక్షల కోట్లు.. ఇంకొకరు 8లక్షల కోట్లు అని చెప్పారని తెలిపారు. దీనిపై బీజేపీ ఎంపీ కేంద్రాన్ని అడిగితే..కేసీఆర్ రూ.2లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశారని చెప్పారని గుర్తుచేశారు.కాగ్ చెప్పిన లెక్కల ప్రకారం బీఆర్ఎస్ చేసిన అప్పు 2లక్షల 80 వేల కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు.ఇక హైడ్రా పేరిట గరీబోళ్ల ఇళ్లు కూలగొడతారు కానీ..కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లు మాత్రం ఈ ప్రభుత్వానికి కనబడవని మండిపడ్డారు.

**రేవంత్‌కు తెల్వదు..చెబితే వినడు**

బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఏం సాధించారని కేటీఆర్ ప్రశ్నించారు.సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని..చెబితే వినడని ఎద్దేవా చేశారు.అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని అన్నారు. ఇంకా మూడేళ్ల అధికారం ఉంది..ఇప్పటికైనా మంచి పనులు చేయాలని హితవు పలికారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని సూచించారు. నిరుద్యోగులు రోడ్లపైకి వస్తున్నారని తెలిపారు. అశోక్ నగర్ వెళ్లడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డి 70వేల ఉద్యోగాలు కాదు..10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు కాగితాలు ఇచ్చి ఫోజులు కొడుతున్నాడని విమర్శించారు.

# మన్నె శ్రీ భజన కీర్తనల పుస్తకావిష్కరణ



మన్నె శ్రీ భజన కీర్తనల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి మాజీ చైర్మన్ కె స్వామి గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు



పాటల పుస్తకాన్ని చూపుతున్న రచయిత మన్నె మహాత్మా రావు, శిష్య బృందం




మన్నె మహాత్మా రావు ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు కె రఘు గౌడ్

## మన్నె మహాత్మారావు అభినందనీయులు : కె స్వామిగౌడ్

**బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం)**

రచయిత, గాయకులు, కవి మన్నె మహాత్మారావు రచించిన మన్నె శ్రీ భజన కీర్తనలు అనే పుస్తకాన్ని ఆదివారం తెలంగాణ శాసన మండలి మాజీ చైర్మన్ కె స్వామిగౌడ్, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లు అవిష్కరించారు. రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం (హరిహర క్షేత్రం) ఆవరణలో ఏర్పాటు చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, భజన మండళ్ల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఒక సాదారణ కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉద్యోగిగా ఉంటూనే ఆధ్యాత్మిక చింతన వైపు ఆకర్షితుడై రెండు వేల భజన పాటలు రాసిన మన్నె మహాత్మారావు అభినందనీయులన్నారు. ఇప్పటి వరకు ఆయన 13 ఆధ్యాత్మిక పుస్తకాలను రచించి విడుదల చేయడం చాలా గొప్ప విషయమన్నారు. కిస్మత్పూర్ ప్రాంతానికి చెందిన మన్నె మహాత్మారావు యుక్త వయస్సు నుంచే శ్రీ రాఘవేంద్ర స్వామీ నాటకం, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి నాటకం లాంటి నాటకలను రాసి ప్రదర్శించిన వ్యక్తి అని కొనియాడారు. ఆధ్యాత్మిక గీతాలే కాకుండ ఆయన రాజకీయ, సామాజిక, జానపద గేయాలను కూడా రాసి పాడే వారన్నారు. మన్నె మహాత్మారావు చిన్న నాటి నుంచే శాఖహారి అని ఆయన గురు ఉపదేశం తీసుకుని ఆధ్యాత్మిక చింతన వైపు నడుస్తు యోగా, భక్తీ, భజన పాటలను అనేక మందికి నేర్పిస్తు సన్మార్గంలో వారిని నడిపిస్తున్న విధానం చరిత్రలో నిలచిపోతుందన్నారు. ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తాము చిన్న నాటి నుంచే మన్నె మహాత్మారావు పాటలు వింటు వస్తున్నామన్నారు. ఒక మ దిరాజ్ ఇంత గొప్ప స్థాయికి ఎదగడాన్ని చూసి గర్వ పడుతున్నానన్నారు. ఆయన రాసిన పుస్తకాలను , పాటలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. ఈ సమావేశంలో మాట్లాడిన పాటల రచయిత, గాయకులు, కవి మన్నె మహాత్మారావు భావోద్వేగానికి గురైనారు. ఇంత మంది ప్రముఖుల మధ్య నేను రాసిన పాటల పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందని

కన్నీళ్లపర్యంతమైనారు. పాటల పుస్తకాన్ని రాయడానికి తనకు సహకరించిన కుటుంబ సభ్యులు, శిష్యులు, సన్నిహితులకు ఈ పుస్తకాన్ని అంకితం చేస్తున్నానన్నారు. ఈ పాటల పుస్తకంలో 108 పాటలు ఉన్నాయన్నారు. తాను ఉ న్నా లేకున్నా ప్రజలలో ఈ పాటలు ఉండిపోతాయని, అది తనకెంతో తృప్తి నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై.శ్రీదర్, అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి , తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ, సీపీఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, కిస్మత్పూర్ మాజీ సర్పంచ్ నీరుడి శేఖర్ మ దిరాజ్, గాయకులు జి.రాములు, బ్రహ్మణపల్లి బాల్ రాజ్, నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు మ ంగలారం శ్రీనివాస్, పటాన్చెరువు తహసీల్దార్ ఎన్ క్రిష్ణ, స్థానిక నాయకులు పి.జంగయ్య, వై.గో పాల్, కె రఘుగౌడ్, కనకమామిడి ప్రవీణ్ కుమార్, సి. సూర్యప్రకాశ్, హనుమంతు, సతీష్, శశి, శేఖర్, యాదయ్య, పచ్చ నర్సింగ్రావు, డంగు నర్సింహ్మరాజు, అబ్బయ్య, జంగయ్య, కన్యగారి నర్సింహ్మరెడ్డి, సి.సుధాకర్, సతీష్ కుమార్, జి. సత్యం. వేముల బాలు, రాజు, బి.రాజేందర్ లు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష: కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్‌కు మెట్రో రాకుండ ఎమ్మెల్యే కుట్ర**

**కార్పొరేటర్ ఎన్నికల్లో గెలిచేది గులాబీ పార్టీనే..**

**సైబరాబాద్‌కు మకుటం లాంటి ప్రాంతం రాజేంద్రనగర్**

**రాజేంద్రనగర్,జనవరి11(ప్రభాత ఉదయం)**


అధికార కాంగ్రెస్ పార్టీతో చిల్లిగవ్వ కూడా లాభం లేదని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి విమర్శించారు.అందుకే కాంగ్రెస్ పార్టీకి నేతలు గుడ్ బై చెబుతున్నారని అన్నారు.బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు.హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష అని జనం బలంగా నమ్ముతున్నారని తెలిపారు. అందుకే బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయని అన్నారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత రాజేంద్రనగర్‌కు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు.రాజేంద్రనగర్‌కు మెట్రో రాకుండా చేశారని మండిపడ్డారు. బండ్లగూడ ప్రాంతాన్ని హైదరాబాద్ కార్పొరేషన్‌లో వేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని పేర్కొన్నారు.సైబరాబాద్‌కు మకుటం లాంటి ప్రాంతం మనది అని వ్యాఖ్యానించారు. సైబరాబాద్ నుంచి హైదరాబాద్‌కు పోదామా అని ప్రశ్నించారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.మన పోరాటానికి ప్రభుత్వం దిగి రావాల్సిందేనని స్పష్టం చేశారు.కార్పొరేటర్ ఎన్నికల్లో గెలిచేది గులాబీ పార్టీనే అని కార్తీక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.చేవెళ్లలో మూడు మున్సిపాలిటీలు మనమే గెలుస్తామని..కాంగ్రెస్ పార్టీకి మూడు చెరువుల నీళ్లు తాగిపిస్తామని అన్నారు.ఇంకా మూడేళ్ల అధికారం ఉ ంది..ఇప్పటికైనా మంచి పనులు చెయ్..ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కు కార్తీక్ రెడ్డి హితవు పలికారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని సూచించారు.




క్రికెట్‌లో విజయం సాధించిన రాజేంద్రనగర్ జట్టుకు ట్రోఫీని బహుకరిస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్

## క్రికెట్ ట్రోఫీని గెలుచుకున్న రాజేంద్రనగర్ జట్టు

బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం) : స్వామి వివేకానంద జయంతి ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో రాజేంద్రనగర్ జట్టు విజేత గా నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూ పాల్ గౌడ్ హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. యువత క్రీడలలో రాణిం చాలన్నారు. ఆటలలో గెలుపోటములు సహజమేనని గుర్తు చేశారు. ఈ పోటీలలో బుద్వేల్ సీనియర్ జట్టు రన్నర్స్ నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా వంశీచారి, మ్యాన్ ఆఫ్ ది సీరిస్ గా సృజన్, బెస్ట్ బౌలర్ గా హేమంత్, బెస్ట్ బ్యాట్స్ మెన్ గా విద్యాధర్, బెస్ ఎమర్జింగ్ టీమ్ గా వెంకటేశ్వర యూత్ అసోసియేషన్ నిలిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.శ్రీధర్, జి. బాబు రావు, పవన్ రాజ్ , వై.గోపాల్, దయాకర్. ఎస్ పెంటయ్య, గుడిసె యాదయ్య, కిరణ్, సతీష్, రాజుభాయ్, సంతోష్, ప్రసాద్, మహేందర్, అరుణ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వేముల రామక్రిష్ణ

## రాజేంద్రనగర్‌లో వడ్డె ఓబన్న జయంతి

బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం) : వడ్డెర లను ఎస్టీ జాబితా లో చేర్చాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ, రాజేంద్రనగర్ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజేంద్రనగర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన యోధుడు వడ్డె ఓబన్న 219వ జయంతి వేడుకలను నిర్వహించారు. నర్సింహ్మరెడ్డి సైన్యానికి సైనాధిపతిగా వీరోచిత పోరాటం చేసిన గొప్ప వీరుడు వడ్డె ఓబన్న అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు కొమిరె శంకర్, కొమిరె గణేశ్, వేముల రమేశ్ దండుల బాబు, కొమిరె బాబు, కుమ్మరి రవి, దం డుగుల శ్రీనివాస్, దీపక్, జగదీశ్, మహేశ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



## గంగపుత్రుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట

**తెలంగాణ ఫిషరీస్ సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్**

**బుద్వేల్ గంగపుత్ర క్యాలెండర్ విడుదల చేసిన సాయికుమార్**

రాజేంద్రనగర్, జనవరి 11 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గంగపుత్ర సంఘం రూపొందించిన నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ను తెలంగాణ ఫిషరీ సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ... గంగపుత్రుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెపోత్సవ చైర్మన్ మల్కు మహేందర్ , తెపోత్సవ అధ్యక్షులు మంగిలి పల్లి రాజు , సాయి బాబా , బుద్వేల్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్ ,వై సునీల్ , సిహెచ్,కైలాష్, డి, రాజు, ఏ. యాదయ్య, ఎన్.వెంకటయ్య, పి.బిక్షపతి ఏ.బాబయ్య, ఏ.సత్య నారాయణ, ఏ.శ్రీరాములు, బుద్వేల్ కుల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రకృతి - సంస్కృతి-మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి



హరిదాసు లకు ధాన్యం అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సతీమణి ఉషమ్మ



ట్రస్ట్ ఆవరణలో స్వామి వివేకానంద వద్ద వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు

**మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు**

**స్వర్ణభారత్ ట్రస్ట్ (హైదరాబాద్ చాప్టర్)లో సంక్రాంతి సంబరాలు, ముప్పవరపు ఫౌండేషన్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు**

**హైదరాబాద్, జనవరి 11(ప్రభాత ఉదయం)**

సేవా మార్గమే తాను విశ్వసించే అసలైన వారసత్వమని భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మనకున్న దానిని నలుగురితో పంచుకోవడం భారతీయ సంస్కృతిలో భాగమని, తమ కుటుంబ సభ్యులు ఈ మార్గంలో ముందుకు సాగడం అత్యంత సంతృప్తిని అందించిందన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముచ్చింతల్ (హైదరాబాద్ చాప్టర్)లో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా... వారి సమక్షంలో ముప్పవరపు ఫౌండేషన్ భవనాన్ని ప్రారంభించారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ల చేతుల మీదుగా ఈ భవన ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు , ప్రముఖ సినీనటులు బ్రహ్మనందం తదితరులు హాజరయ్యారు. కార్యక్రమ అనంతరం ట్రస్ట్ ప్రాంగణంలోని సర్దార్ పటేల్ ప్రజామందిరంలో ఆహూతులను ఉద్దేశించి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... రాజకీయాల్లో కుటుంబ వారసత్వాన్ని తాను ఇష్టపడనని చెప్పారు. క్యారక్టర్ (గుణం), కెపాసిటీ(సామర్థ్యం), క్యాలిబర్(యోగ్యత), కాండక్ట్(నడత) అనే అర్హతలు ఉన్న ఎవరైనా రాజకీయాల్లో రాణించవచ్చని, అయితే సేవను వారసత్వంగా తీసుకోవడం మంచి విషయమని తాను విశ్వసిస్తానని చెప్పారు. సమాజానికి ఏదైనా తిరిగి ఇవ్వాలన్న సంకల్పంతో 25 సంవత్సరాల క్రితం తాను ప్రారంభించిన స్వర్ణభారత్ ట్రస్ట్ ను తన కుమార్తె దీపావెంకట్ విజయవంతంగా నడిపిస్తున్నారని, ఇప్పటివరకు లక్షమందికి నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ఉచితంగా ట్రస్ట్ ద్వారా శిక్షణ అందించారని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. తన కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ ముప్పవరపు ఫౌండేషన్ ద్వారా సేవామార్గంలో పయనించడం సంతోషంగా ఉందన్నారు. "తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులను వారసత్వంగా ఇస్తారు. అందులో వారికి ఆనందం లభిస్తుంది. అయితే ఆస్తులు మాత్రమే కాదు మంచితనాన్ని, మానవత్వాన్ని, సమాజం పట్ల బాధ్యతను కూడా వారసత్వంగా అందించాలి. అప్పుడు మహదానందం లభిస్తుంది. పురాతన భారతీయ ధర్మమైన షేర్ అండ్ కేర్ సూత్రాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. మనకున్న దానిని నలుగురితో పంచుకోవడం, నలుగురి సంక్షేమం పట్ల శ్రద్ధ వహించడం మన జీవన విధానంలో



గంగిరెద్దు ఆటలను తిలకిస్తున్న ప్రముఖులు

భాగం చేసుకోవాలి" అని పేర్కొన్నారు.

సంక్రాంతి పండగ తెలుగు వారి సంస్కృతికి ప్రతీక అని, ఇది ప్రకృతిని గౌరవించే గొప్ప పండగ అని వెంకయ్యనాయుడు చెప్పారు. పండగ అంటే కొత్తబట్టలు, కొత్త ఆలోచనలే గాక పాత అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకుని, భవిష్యత్తును నిర్ణయించుకుని ముందుకు సాగడం అని పేర్కొన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు, కళలు, మన ఆచార వ్యవహారాలు, మన ఆనందాన్ని నలుగురితో పంచుకుంటే అసలైన ఆనందం వస్తుందని అన్నారు. "ఆ రోజుల్లో వ్యవసాయమే మనకు ఆధారంగా ఉండేది. దాని ద్వారా వచ్చే ఫలసాయం మన అవసరాలకు ఉంచుకోవడమే కాకుండా, మనతో పని చేసిన శ్రామికులకు, అన్ని వృత్తుల వారికి పంచి ఇచ్చి, ఆనందాన్ని పంచే పండుగ సంక్రాంతి. వ్యవసాయంలో రైతులకు సాయంగా శ్రమించే పశువులను కూడా పూజించే సందర్భం ఈ పండగ. కనుమ నాడు పశువులను అలంకరించి పూజించడం మన సంప్రదాయం." అని వెంకయ్యనాయుడు గుర్తు చేశారు.

రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పాలన వ్యవహారాలను తెలుగులోనే కొనసాగించాలని సూచించారు. అలాగే రాష్ట్రాలు వేరైనా మన మూలం తెలుగేనని, ఏమైనా సమస్యలుంటే కలిసి కూర్చొని పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్న ఆకాంక్షను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. హైదరాబాద్ నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇంకా అభివృద్ధి చెందుతుందని, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకుంటుందన్న విశ్వాసం తనకు ఉందని చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ స్వరకల్పన చేసి ఆలపించిన వేమన పద్యాల సీడీని వెంకయ్యనాయడు ఆవిష్కరించారు. అంతకు ముందు... 6 దశాబ్దాలుగా కోటిన్నర చెట్లను నాటి తన జీవితాన్ని ప్రకృతి పరిరక్షణకు అంకితం చేసిన వనజీవి రామయ్య జీవిత కథను చలనచిత్రంగా తీసుకువస్తున్న నేపథ్యంలో సినిమాలోని ఓ దృశ్యం లో భాగంగా, స్వర్ణభారత్ ట్రస్టులో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్, కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్ఎస్‌లోకి స్వాగతిస్తున్న మల్లారెడ్డి

## బాల్యంలో ఆర్ఎస్ఎస్ పట్ల పునాదులు వేయాలి: మల్లారెడ్డి

**సాకేత్ ను ఆర్ఎస్ఎస్ లోకి స్వాగతించిన మల్లారెడ్డి**

రాజేంద్రనగర్, జనవరి 11(ప్రభాత ఉదయం) పిల్లలను బాల్యం నుండే క్రమశిక్షణ కోసం ఆర్ఎస్ఎస్ లో చేర్పించాలని బిజెపి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్, ఆర్ఎస్ఎస్ బాధ్యుడు నారా గూడెం మల్లారెడ్డి అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ హైదర్ గూడ నుంచి ఉప్పరపల్లి వరకు రాష్ట్రీయ సేవా సంఘం నిర్వహించిన కర్ర సేవకులు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కర సేవకులకు హైదర్గూడ లో ఘన స్వాగతం పలికారు .ఈ కార్యక్రమంలో హైదర్గూడ నివాసి సాకేత్ కి తన కుటుంబ సభ్యులు రాష్ట్రీయ సేవా సంఘం తో పాటు హిందూ ధర్మ రక్షణ కోసం ఎప్పుడు ముందుగా నించొని ఉండాలని నూతన వస్త్రాలు ధరింపజేసి పంపించారు. కుటుంబ సభ్యులు ఉదయాన్నే హారతి ఇచ్చి పూజా నిర్వహించి తన తల్లి స్వాతి, పెద్దమ్మ సౌజన్య కలసి తిలకం దిద్ది మంగళహారతి తో పూజ నిర్వహించి కార్యక్రమానికి పంపారు.

# డాక్టర్ అంబేద్కర్ అన్ని వర్గాలకు ఉపయోగపడేలా రాజ్యాంగాన్ని రూపొందించారు


**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ సర్కిల్) జనవరి 11 ( ప్రభాత ఉదయం):**

బాబాసాహెబ్ అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా భారత రాజ్యాంగాన్ని అందించారని వడ్డెర యువజన సంఘం ఘట్కేసర్ మండల అధ్యక్షుడు మైసగాని సాయికుమార్ అన్నారు. ఆదివారం ప్రబుద్దా భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 248 వారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వడ్డెర యువజన సంఘం ఘట్కేసర్ మండల అధ్యక్షులు మైసగాని సాయికుమార్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా భారత రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా వారి స్ఫూర్తితో సాయికుమార్ వడ్డెరలను ఎస్ టి లో చేర్చే వరకు పోరాటం చేస్తామని అన్నారు. అంబెద్కర్ బిసి, ఎస్సి, ఎస్టి లకు మాత్రమే చేసారు అనేది తప్పు, ఓసి లు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారు అంటే అది డాక్టర్ బాబాసాహెబ్ అంబెద్కర్ భారత రాజ్యాంగంతోనే సాధ్యం అయింది అని చెప్పారు. అంబెద్కర్ భారత దేశంలో సబండ వర్గాల నాయకుడు అని అన్నారు. మనం మహనీయుల జీవిత చరిత్ర తెలుసుకొని వారి ఆశయ సాధన కోసం పని చేయాలని తెలియజేసారు. అలాగే ప్రతివారం ఇంత ఘనంగా నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించటం అంబెద్కర్ పైన అరుణ్ కుమార్ నిబద్ధతని తెలియజేస్తుంది అని అన్నారు. ఇలా ప్రజలని




చైతన్య పరుస్తున్న యం.అరుణ్ కుమార్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వడ్డే ఓబన్న బ్రిటిష్ వారిని వణికించిన రేనాటి గెరిల్లా యోధుడు 219 వ జయంతి నిర్వహించారు. అరుణ్ కుమార్ వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అరుణ్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంజామల గడ్డపై 1807 జనవరి 11న జన్మించిన వడ్డే ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యంలో సర్వసైన్యాధ్యక్షుడిగా వ్యవహరిస్తూ బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు గట్టి సవాల్ విసిరిన మహావీరుడని అన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో 1857 సిపాయిల తిరుగుబాటుకు దశాబ్దాల ముందే తెలుగునేలపై చెలరేగిన తొలి విప్లవానికి ఓబన్న ప్రాణం పోశారని గుర్తు చేశారు. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన శాశ్వత భూమిశిస్తు విధానం రద్దు, రైతులుపై పెరిగిన పన్నుల భారం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయన్నారు. వడ్డెరలు, బోయలు, చెంచులతో కూడిన ప్రజాసైన్యాన్ని నిర్మించి, నల్లమల అడవులను కేంద్రంగా చేసుకుని గెరిల్లా యుద్ధ పద్ధతిలో బ్రిటిష్ బలగాలపై మెరుపు దాడులు నిర్వహించారని అన్నారు. 1846 జూలై 10న కోవెలకుంట్ల సబ్ ట్రెజరీపై జరిగిన దాడి ఆంగ్లేయులను వణికించింది. అడవులు, కొండలు, వాగులను ఆయుధాలుగా మార్చుకుని శత్రువుకు నీడ కూడా దొరకని విధంగా పోరాడిన ఓబన్న ధైర్యసాహసాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. 1846 అక్టోబర్ 6న గిద్దలూరు సమీపంలోని జగన్నాథకొండ వద్ద జరిగిన యుద్ధంలో 39 ఏళ్ల వయసులోనే ఆయన వీరమరణం పొందారని చెప్పారు. ఆయన మరణం తరువాత ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని బ్రిటిష్ వారు బంధించి 1847 ఫిబ్రవరి 22న బహిరంగంగా ఉరి తీశారన్నారు. వడ్డే ఓబన్న రగిలించిన విప్లవ జ్వాల భారత స్వాతంత్ర్య పోరాటానికి బాటలు వేసిందని అన్నారు. చాలా కాలం పాటు చరిత్రలో తగిన గుర్తింపు లభించని ఈ మహావీరుడిని నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వడ్డే ఓబన్న త్యాగం, ధైర్యం, దేశభక్తిని భావి తరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం ఘట్కేసర్ మండల ఉపాధ్యక్షుడు నర్సింగరావు, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఎం నర్సింగరావు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బండారి రాందాస్, ఈడబ్ల్యూఎస్ కాలనీ కె.సత్యం, కదుపోల బిక్షపతి, కె మహిపాల్, జి అంజయ్య, బి గణేష్ గౌడ్, బి సురేష్ గౌడ్, కృష్ణం రాజు, ఇ విష్ణు, అఖిల్, డి శివ కృష్ణ, లలిత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





కురుమలు సంఘటితంగా ఉండాలి:యగ్గే మల్లేష్

# యగ్గే మల్లేష్, క్యామ మల్లేష్‌లతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించిన మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్

బోరబండ,జనవరి11(ప్రభాత ఉదయం) కురుమ సోదరులు వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్నప్పటికీ సంఘటితంగా ఉన్నప్పుడే న్యాయం జరుగుతుందని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యగ్గే మల్లేష్ అన్నారు. ఆదివారం బోడబండలోని బీరప్పస్వామి దేవాలయం ఆవరణలో బీరలింగేశ్వరస్వామి బిఎస్కేఎస్ నూతన క్యాలెండర్ ను ఎమ్మెల్సీ,కురుమరత్న యగ్గే మల్లేష్ కురుమ,తెలంగాణ కురుమ సంఘం అధ్యక్షులు క్యామ మల్లేష్, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ లతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. .కుల సంఘాల నాయకులకు కుటుంబం బాధ్యతతో పాటు సంఘటితశక్తిగా జాతిని నడిపే రెండు బాధ్యతలు ఉంటాయన్నారు.కురుమ లందరూ ఐక్యంగా ఉండి సంఘం బలోపేతానికి కృషి చేయాలని,తమ పిల్లలను చదివించుటకు అందరూ పాటుపడాలని రాజకీయంగా,ఆర్థికంగా,బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.అన్ని రంగాల్లో పిల్లలను ప్రోత్సహించి ఉన్నత అధికారులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు.కుల బాంధవులందరూ ఐక్యమత్యంతో ఉండి మనతో పాటు కులాన్ని మంచి మార్గంలో తీసుకెళ్లాలని తెలియజేశారు.కుల సంఘాల నాయకులకు కుటుంబం బాధ్యతతో పాటు సంఘటితశక్తిగా జాతిని నడిపే రెండు బాధ్యతలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తూముకుంట అరుణ్ కుమార్,తెలంగాణ యువత అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ కురుమ,బీరలింగేశ్వర సేన కురుమ సంఘం చైర్మన్ కరాటే శ్రీనివాస్ కురుమ,వైస్ చైర్మన్ మగనూరు శ్రీనివాస్ కురుమ,ప్రెసిడెంట్ ఎస్.నరసింహ కురుమ,వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్,కురుమశాలి శంకర్,బీ.శివ శంకర్,సి.శివరాజ్,జనరల్ సెక్రెటరీ ఒగ్గు శ్రీనివాస్,బాయికాడి మూర్తి,ముత్యాల శివశంకర్,ఎల్కోటి సత్యనారాయణ,ఉప్పల్ శ్రీను,ప్రవీణ్,సన్నీ,పోతురాజు రమేష్,నామాల రాము,శేఖర్,జంటనగరాల నలుమూలల నుంచి వచ్చిన కురుమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటాం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మేడ్చల్ మున్సిపల్) జనవరి11 ( ప్రభాత ఉదయం):**

మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సోను ఫంక్షన్ హాల్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్ పెద్ది సుధీర్ రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి లు పాల్గొని పార్టీ స్థితిగతులపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్



ఎల్లంపేటలో కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేష్ యాదవ్

నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలను కైవసం చేసుకొని కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని అన్నారు. ప్రజా పాలననే మా బలం, సంక్షేమమే గెలుపు మంత్రం 68 వార్డుల్లో మెజారిటీ కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చైర్మన్ పీఠాలన్నీ కాంగ్రెస్ పార్టీవేనని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలను పూర్తిగా కైవసం చేసుకుని హస్తం జెండాను ఎగురవేస్తామని చెప్పారు. ప్రజా పాలనతో ప్రజల నమ్మకం సంపాదించుకున్న కాంగ్రెస్ పార్టీకే ఈ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందిస్తాయని స్పష్టం చేశారు. జిల్లాలోని ఆలియాబాద్, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల్లో ఉన్న మొత్తం 68 వార్డుల్లో మెజారిటీ స్థానాలు సాధించి, అన్ని చైర్మన్ పీఠాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశ ప్రజలందరు స్వాభిమానం కలిగి జీవించాలి

## ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహ ప్రాంత కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్

**బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం)**

దేశమే ప్రథమం అని, దేశ ప్రజలందరు స్వాభిమానం కలిగి ఉండాలని చైతన్యం చేయడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహ ప్రాంత కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్ అన్నారు . ఆర్ఎస్ఎస్ ను స్థాపించి 100 సంవత్సరాలు కావస్తున్న సందర్భంలో ఆదివారం ఉప్పర్ పల్లి లో నిర్వహించిన మకర సంక్రాంతి ఉత్సవాలలో పాల్గొన్న వందలాది స్వయం సేవకులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. సమాజంలో మార్పు రావాలంటే తాను, తన కుటుంబం, సమాజం స్వదేశీ వస్తువులనే వాడాలని, స్వాభిమానంతో జీవించాలని, రాజ్యాంగ హక్కులనే కాదు రాజ్యాంగ విలువలను కాపాడాలి అన్నారు. సమాజంలో ఉన్న వారందరు సమానమేనని వారందరు భేదభావాలు లేకుండ జీవించాలని, సామరస్యంగా ఉండాలన్నారు. స్వదేశీ వస్తువుల వాడకం పై ప్రజలలో మరింత చైతన్యం, అవగాహన కల్పించాల్సిన ఆవసరం ఉందన్నారు. అప్పుడే




ఆర్ ఎస్ ఎస్ సంక్రాంతి ఉత్సవంలో పాల్గొని ప్రసంగిస్తున్న తెలంగాణ సహా ప్రాంత కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్



మకర సంక్రాంతి ఉత్సవంలో పాల్గొన్న ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు

భారత్ అఖండ శక్తిగా ఎదగగలుగుతుందన్నారు. ప్రపంచానికి మె ట్టమొదటగా సభ్యతను, సంస్కృతిని, జీవన విధానాన్ని నేర్పిన భారతదేశం మరో సారి బానిస నీడలోకి వెళ్లకుండ ప్రపంచంలోనే ఒక అఖండ శక్తిగా నిలపడానికి పౌరులు ఆర్ఎస్ఎస్ తో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎడిపై ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి. రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జరిగిన పద సంచాలనం (రూట్ మార్చ్) లో వందల సంఖ్యలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.





# పొలం బాట పట్టిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)**

జగిత్యాల జిల్లాలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి చేసిన క్షేత్ర స్థాయి పర్యటనకు విశేష స్పందన లభించింది. ధర్మపురి మండలంలోని గ్రామాల్లో ఆమె పొలాల్లోకి వెళ్లి మహిళా కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తూ, గ్రామీణ జీవన కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అధికారిణిగా మాత్రమే కాకుండా ప్రజలతో కలిసిపోయిన ఆమె పర్యటన అందరి ప్రశంసలు పొందింది. జగిత్యాల జిల్లాకు నియమితులైన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. పొలాల్లోకి నేరుగా వెళ్లిన హరిణి, వ్యవసాయ కూలీలతో మమేకమయ్యారు. వరి పొలంలోకి దిగిన ఆమె.. రైతులు మహిళా కూలీలతో కలిసి వరి నాట్లు వేసి, వారి జీవన విధానం, కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. నాటు వేసే విధానాన్ని అడిగి తెలుసుకున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, స్వయంగా బురదలోకి దిగి కొంతసేపు నాట్లు వేశారు. వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలతో కలిసి పనిచేసిన అనంతరం, లంచ్ సమయంలో వారికి పండ్లను పంపిణీ చేశారు. అలాగే మహిళా రైతులతో కలిసి సెల్ఫీలు దిగుతూ, సుమారు అరగంట పాటు వారి మధ్య గడిపారు.గ్రామీణ మహిళలతో కలిసి పనిచేయడం, వారి జీవన పరిస్థితులను తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని హరిణి తెలిపారు. అధికారిగా మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రజలతో కలిసిపోయిన ఆమె క్షేత్ర స్థాయి పర్యటన స్థానికుల్లో విశేష స్పందనను పొందింది. నేరుగా అధికారి పొలాల్లోకి వచ్చి తమతో కలిసి పనిచేయడం చూసి మహిళా రైతులు సంతోషం వ్యక్తం చేశారు.




కృష్ణానగర్ లో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# కృష్ణా నగర్ కాలనీ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యులు పాటుపడాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి**

**(మీర్పేట హౌసింగ్ బోర్డ్ డివిజన్ ) జనవరి 11 (ప్రభాత ఉదయం):-**

మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యులు పాటుపడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని కృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానగర్ కాలనీ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యులు పాటుపడాలని చెప్పారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తెచ్చినచో వాటికి పరిష్కార మార్గం చూపిస్తానని కాలనీవాసులకు ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోళ్లురి అంజయ్య, ప్రెసిడెంట్ మల్లారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



మడేలయ్య రజక సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించిన మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్

# బీసీ కులాలు సంఘటితం కావాలి. శంకర్ గౌడ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహర్ నగర్ డివిజన్ ) జనవరి 11 ( ప్రభాత ఉదయం):**

బీసీ కులాలు సంఘటితం కావాలని జోహార్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మడేలయ్య రజక సంఘం అధ్యక్షుడు శనిగరం నరసింహ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కోరింగుల శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ - జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ లు పాల్గొని నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాధికారం వైపు పయనిచెందుకు బీసీ కులాలు సంఘటితం కావాలని ఆయన తెలిపారు. అనంతరం జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చేయూతనందిస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నగరపాలక సంస్థలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్, జవహర్ నగర్ బీసీ జేఏసీ సంఘాల అధ్యక్షుడు మారోజు సోమాచారి, నాయకులు దేవేందర్, కాయిత రాజు యాదవ్, అజయ్ కుమార్, అనిల్, తో పాటు రజక సంఘం ప్రధాన కార్యదర్శి ఓరుగంటి భాస్కర్, ఉపాధ్యక్షులు కస్తూరి పల్లి రాములు, కోశాధికారి ఆర్ రమేష్, జి బాలరాజు, ఎం బాలరాజు, బి సాగర్, ఎస్ సత్తయ్య, వి భాస్కర్, టీ నర్సయ్య, కే శ్రీనివాస్, ఎస్ కనకరాజు, ఏం రాములు, ఏ పవన్ కుమార్, జి అంజయ్య, వి వెంకటయ్య, కే రాజయ్య, సిహెచ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌ను హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలుపకుండ చూడాలి

## ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి పత్రం అందజేసిన అఖిల పక్ష పార్టీల నాయకులు



ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను కలిసి వినతి పత్రం అందచేస్తున్న అఖిల పక్ష పార్టీల నాయకులు

**బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం):**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల ను హైదరాబాద్ కార్పొరేషన్ లో హైదరాబాద్ జోన్ లో కలుపకుండ సైబరాబాద్ లో ఉంచాలని ముఖ్యమంత్రి తో మాట్లాడాలని కోరుతు అఖిల పక్ష పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ను మైలార్దేవుపల్లి లో గల ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ కార్పోరేషన్లో రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని కలిపితే ఆర్థికంగా, రాజకీయంగా, అభివృద్ది పరం గా ఎంతో వెనుకబడి పోతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని సైబరాబాద్ కార్పోరేషన్లో, సైబరాబాద్ కమిషనరేట్ లోనే ఉండేటట్లు చూడాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్రెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేసా నన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ను కలిసిని వారిలో అఖిల పక్ష పార్టీల కు నాయకత్వం వహిస్తున్న పోరెడ్డి ధర్మారెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, సీపీఐ పార్టీకి చెందిన పుస్తకాల నర్సింగ్రావు, కన్యగారి నర్సింహ్మారెడ్డి, బీఆర్ఎస్ నుంచి కొలన్ సుభాష్ రెడ్డి, ఎస్ వెంకటేశ్, డి రమేశ్ ముదిరాజ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, ముక్రంఖాన్, జహీర్ ఖాన్, పి.జీవన్ దాస్, చిరంజీవి, ఎడ్లకాడి సూర్యం, అహ్మద్ పటేల్. పి సాయిగౌడ్, ఆనం ద్ గౌడ్, భూదేవి, కోరని రవీందర్, మైసిరెడ్డి తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

# కిష్టారెడ్డిపేట కేంద్రంగా నూతన డివిజన్ ఏర్పాటు చేయకపోతే ఛలో బల్దియా

## పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,జనవరి 21 (ప్రభాత ఉదయం):**




రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బల్దియా డివిజన్ల ఏర్పాటులో శాస్త్రీయత లోపించిందని ఒక లక్ష 20 వేల ఓటర్లు కలిగిన అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో కేవలం రెండు డివిజన్లు ఏర్పాటు చేయడం ఇందుకు ఉదాహరణ అని, ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయలను బలపరుస్తూ వెంటనే మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేయాలని.. లేనిపక్షంలో జిహెచ్ఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. కిష్టారెడ్డిపేట కేంద్రంగా నూతన డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో కిష్టారెడ్డిపేట గ్రామంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి పరిధిలో నూతన డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించిందని తెలిపారు. ఈ క్రమంలో పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని తెల్లాపూర్, అమీన్పూర్, బొల్లారం మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేయడంతో పాటు ఆరు డివిజన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు, సర్వేలు నిర్వహించకుండా కేవలం గూగుల్ మ్యాప్స్ ఆధారంగా డివిజన్లను ఏర్పాటు చేయడం అన్యాయమని అన్నారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో లక్షా ఇరవై వేల ఓటర్లతో పాటు మూడు లక్షల జనాభా ఉండగా కేవలం రెండు డివిజన్లు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పరిపాలన వికేంద్రీకరణ, అభివృద్ధి జరగాలంటే 25 వేల నుండి 30 వేల ఓటర్లకు ఒక డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇప్పటికే ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి, బల్దియా కమిషనర్ కు వినతి పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో మరో రెండు నూతన డివిజన్లు ఏర్పాటు చేయాలని,లేనిపక్షంతో వేలాది మందితో కలిసి హైదరాబాద్ లోని బల్దియా ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచించకపోతే సంక్రాంతి తర్వాత మరో మారు సమావేశమై కార్యాచరణ ప్రకటిద్దామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అఖిలపక్ష బృందం సభ్యులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# పరమత సహనానికి ప్రతీక

## పటాన్ చెరు:ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### చిట్కుల్ లో జీసస్ ప్రేయర్ హౌస్ చర్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన

పటాన్ చెరు, జనవరి 11 (ప్రభాత ఉదయం):పరమత సహనానికి ప్రతీక పటాన్ చెరునియోజకవర్గమని, కులమతాలకు అతీతంగా సుపరిపాలన చేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల జీసస్ ప్రేయర్ హౌస్ చర్చి పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో సొంత నిధులతో దేవాలయాలు, చర్చిలు, మసీదులు నిర్మించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నూతన చర్చి నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.




# ఓసి జేఏసీ మహాసభకు హాజరైన జనగామ ఓసి నాయకులు

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం):**

ఓసి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పెద్ద ఎత్తున జరిగిన బహిరంగ జరిగింది. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా నుండి ఓసి జేఏసీ నేతలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సభను విజయవంతం చేయడానికి జనగామ జిల్లా 12 మండలాల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్,, ప్రధాన కార్యదర్శి గన్ను నరసింహులు, రీజన్ చైర్మన్ పడకంటి రవీందర్, పజ్జూరి జయ హరి, అరుగుల శ్రీనివాస్,, జైన రమేష్, మార్వాడి సంఘం నాయకులు కృష్ణ జీవన్ బజాజు తదితరులు పాల్గొన్నారు.

# లింగాలగణపురం మండలం ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా గుగ్గిళ్ళ శ్రీకాంత్

## ఉపసర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం):**




జిల్లా లోని లింగాలగణపురం మండలం వడిచర్ల గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గుగ్గిళ్ళ శ్రీకాంత్ ను లింగాలగణపురం మండలం ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా ఉపసర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్ శ్రీకాంత్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పండుగ హరీష్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఉపసర్పంచ్లకు భంగం కలిగే విధంగా ఏ సమస్య ఎదురైనా ఫోరం తరపున పోరాడే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ల హక్కులు, సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన మండలం ఉపసర్పంచ్‌లందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా, నిబద్ధతతో నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపసర్పంచ్లు, ఫోరం నాయకులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఎనగందుల బిక్షపతి..

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 11 (ప్రభాత ఉదయం)**



విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, సమాజ సేవకులు ఎనగందుల బిక్షపతి ని సభ వేదిక ప్రకటించారు. . ఈ సందర్భంగా ప్రాంత అధ్యక్షులు నర్సింహ్మామూర్తి మాట్లాడుతూ జనగామ జిల్లాలో పరిషత్ హిందువులను సంఘటితం, చైతన్యం చేసే విధంగా కృషిచేయాలని తెలిపారు. కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ధర్మప్రచారం, కార్యక్రమ నిర్వహణలో జనగామ ముందంజలో నిలుస్తున్నదని, మరింత విస్తృత కార్యక్రమ నిర్వహణ, కార్యవర్గ విస్తరణ అవసరమున్నందున, మరింత బలాన్ని ఇచ్చేందుకు సమర్థవంతమైన అధ్యక్షుడిని నియామకం చేస్తున్నట్లు తెలిపారు. యావత్ జనగామ జిల్లా హిందువులందరూ విశ్వహిందూ పరిషత్ కి చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ విభాగ్ కార్యదర్శి నందాల చందర్ బాబు, జనగామ జిల్లా నుండి కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, సహాకార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, దుర్గా వాహిని కన్వీనర్ బొల్లు ఝాన్సీ, భజరంగ్ దల్ కోకన్వినర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు, నూతన అధ్యక్షుడికి అభినందనలతో స్వాగతం పలికారు.




# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

## రాహుల్ ప్రదీప్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిఖరం


**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత ఉదయం)**

యాంత్రిక జీవితానికి అలవాటు పడిన ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని దాసరి రాహుల్ ప్రదీప్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్ క్లేవ్ లో ఆర్.ఎన్.సి హాస్పిటల్ డాక్టర్ రమేష్ సౌజన్యంతో తేళ్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్డేపల్లి ఎన్ క్లేవ్ కార్యదర్శి డాక్టర్ సంతోష్ కుమార్, పీఎస్ఆర్కే భగవాన్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేళ్ల హరికృష్ణ, రాహుల్ ప్రదీప్ మాట్లాడుతూ రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు తమ వంతు కృషిగా తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి గత ఆరు నెలలుగా హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ డివిజన్ లో పలుచోట్ల బ్లడ్ డొనేషన్ క్యాంప్, హై టెస్టింగ్ క్యాంప్, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది ఐదవ క్యాంప్ నిర్వహిస్తున్న వైద్య శిబిరమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జీఆర్బీఎస్, సీబీపీ, ఈసీజీ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్, ఉచిత మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని వైద్య సేవలను ఉపయోగించుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న హాస్పిటల్స్ సిబ్బందికి డాక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కూకట్‌పల్లిలో రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రూ.60.5 లక్షల వ్యయంతో రోడ్డు పనులకు అంచనాలు...త్వరలో పనులు ప్రారంభం

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత ఉదయం)**



టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పర్యటనలో భాగంగా ఎన్ఆర్ ఎస్ఏ కాలనీ, డైమండ్ హిల్స్, సీబీసీఐడి కాలనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల వాసులు తమ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితిని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ ప్రజల అభ్యర్థన మేరకు, రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా బండి రమేష్ వెంటనే చర్యలు తీసుకొని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా రోడ్ల పనుల కోసం వర్క్ ఎస్టిమేషన్లు వేయించడం జరిందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ చౌదరి అన్నారు.

**అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి:**

సీబీసీఐడి కాలనీ రోడ్డు పనులకు రూ. 25 లక్షలు,ఎన్ ఆర్ ఎస్ ఏ కాలనీ, డైమండ్ హిల్స్ రోడ్డు పనులకు రూ. 35.5 లక్షలు, ఇంజనీరింగ్ అధికారులు త్వరలో టెండర్లు పిలిచి, రోడ్డు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఇదివరకే గోపాల్ నగర్‌లో రూ. 80 లక్షల వ్యయంతో రోడ్డు పనులు ప్రారంభం కాగా, డైమండ్ హిల్స్ ప్రాంతంలో ఐమాక్స్ లైట్లు, వీధి దీపాల ఏర్పాటు విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. ఈ అభివృద్ధి పనులన్నీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకుఇది నిదర్శనం అని అన్నారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి ప్రజల తరపున బండి రమేష్ కు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శివ చౌదరి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




# శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

## చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు గంధం రాజు

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత ఉదయం)**

సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా రమ్య గ్రౌండ్ శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం రాజు సౌజన్యంతో ఆదివారం రమ్య గ్రౌండ్లో చిన్నారులకు ఉచితంగా గాలిపటాలను పంపిణీ చేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందించిన గంధం రాజు కి శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంధం రాజు మాట్లాడుతూ పిల్లలు ఎంతో సంతోషంగా సుమారు 300 మంది దాకా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, మన సంస్కృతి సాంప్రదాయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్న శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడానికి నా వంతుగా ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు కట్టా నరసింగరావు, ప్రధాన కార్యదర్శి కామిని నర్సింహారెడ్డి, జాయింట్ సెక్రెటరీ వాసిరెడ్డి లక్ష్మి నారాయణ, షేక్ సత్తార్, కొల్లా శంకర్, పెండేల వెంకట కోటేశ్వరరావు, తమ్మినేని ప్రవీణ్ కుమార్, మోటేపల్లి శివకుమార్,. నారాయణరావు, గోనెల దొరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ముగ్గుల పోటీలు

### కైట్ ఫెస్టివల్ ఐక్యతకు మారు పేరు...పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత ఉదయం)**



సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ప్రకాశం నగర్ డివిజన్ లోని శ్రీశ్రీశ్రీ భూలక్ష్మి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో విశాల్ సుధాం ఆధ్వర్యంలో భరత్ నగర్ లో పోచమ్మ టెంపుల్ దగ్గర ఇష్ట కామేశ్వరి కోలాటం గ్రూప్ ఆధ్వర్యంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు సౌజన్యంతో ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలలో మహిళల సోదరీమణులు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. మహిళాసోదరీమణులు వేసిన ముగ్గుల ను తిలకించి మహిళలను అభినదించి, అనంతరం పోటీలో విజేతలకు ప్రత్యేక బహుమతులు, పాల్గొన్న వారికీ బహుమతులు అందజేయడం జరిగింది. కాంగ్రెస్ యువ నాయకులు కుక్కల వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ గణేశ్ ఆలయం దగ్గర నిర్వహించిన కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి సత్యం శ్రీరంగం హాజరై, వారి చేతుల మీదుగా పతంగులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతి బింబం సంక్రాంతి. మహిళలందరూ సంతోషంగా వారిలో ఉన్న కళ నైపుణ్యాన్నివెలికితీయడానికి రంగురంగుల ముగ్గుల పోటీలు దోహదపడుతాయని అన్నారు. ముగ్గుల పోటీల ద్వారా మహిళలలో సృజనాత్మకత బయటపడుతుందని, మహిళలందరూ వారి వాకిళ్ళలో ముగ్గులు వేసి ఒక్కొక్కరి నైపుణ్యం బయటికు వెళ్లబుచ్చుతారని తెలిపారు. పతంగులు ఎగరవేసటప్పుడు చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల బారిన పడవొద్దని, తల్లితండ్రులు అవగాహనా కల్పించాలని, పండుగ అందరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు టోచర్, నరసింగరావు, బేగంపేట్ రమేష్, వరహాల స్వామి, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, డివిజన్ ల మహిళా అధ్యక్షురాలు రాధా, జోజమ్మ, జాన్ దేవదానం, సుర్జీత్ గౌడ్, నరసింహ యాదవ్, సప్పిడి భాస్కర్, ఇష్ట కామేశ్వరి కోలాటం గ్రూప్ అధ్యక్షురాలు కర్నాటి శివలక్ష్మీ, వ్యవస్థాపకులు అరుణ ఉపద్రష్ట సాయి అలేఖ్య, ఆర్గనైజర్ వరుదు సుజాత, చున్ను పాషా, భరత్, అశోక్ ముదిరాజ్, వెంకటేష్, భరత్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, బాల, అరుణ్ గౌడ్, భరత్ వంశీ, చిటుకోరు కృష్ణ, పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పెద్ద ఎత్తున హాజరైనారు.

# బొల్లారం పబ్లిక్ స్కూలులో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**పటాన్ చెరు, జనవరి 11 (ప్రభాత ఉదయం):**

బొల్లారం డివిజన్ పరిధిలోని బొల్లారం పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం గాలిపటాల పండుగ, ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆనంద్ కృష్ణారెడ్డి, వేణు పాల్ రెడ్డి, ప్రత్యుష రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థినిలు పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి సందడి చేయగా, బాలుర విద్యార్థులు పతంగులు ఎగురవేసి ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. విద్యార్థులు ధరించిన నారదుడు వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పండుగలు మన గొప్ప సంస్కృతికి నిదర్శనం అన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఉపాధ్యాయ విద్యార్థి బృందాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగవల్లికలు, కైట్ ఫెస్టివల్ కార్యక్రమాలతో అలరించారు. విజేతలకు ఆనంద్ కృష్ణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,వి.ప్రత్యూష రెడ్డి,రజితా రెడ్డి, తదితరులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం పబ్లిక్ పాఠశాల నిర్వాహకులు ప్రభు కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలపై మల్లన్న స్వామి ఆశీస్సులు ఉండాలి: నీలం మధు ముదిరాజ్

### రుద్రారం మల్లన్న స్వామి జాతరలో పాల్గొన్న మధు

**పటాన్ చెరు,జనవరి 11 (ప్రభాత ఉదయం):**

మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారంలో జరుగుతున్న మల్లన్న స్వామి జాతర మహోత్సవంలో పాల్గొన్న ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి సత్కరించి ఆ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ జాతరలు ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు ప్రజలంతా ఐక్యమత్యంగా కలిసి ఉంటారన్నారు. ఆ మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు కూర్మ వెంకన్న, సుధీర్ రెడ్డి, ప్రభు, వంశీ కృష్ణ, ప్రశాంత్,గణేష్, చంటి, మహేష్, కార్తీక్, అశోక్, మహేష్, ప్రవీణ్, గ్రామ పెద్దలు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే క్రిష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణంలోని మార్కెట్ యార్డ్ పక్కన జరుగుతున్న 88 వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆయత చండీ అతిరుద్ర యాగం -- సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గద్వాల శాసన సభ్యులు బండ్ల క్రిష్ణ మోహన్ రెడ్డి స్వామి వారిని కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.శివలింగానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అభిషేకం చేసి ప్రత్యేక పూజ నిర్వహించి ఆ పరమశివుని ఆశీస్సులను స్వీకరించారు .ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.... అత్యంత పవిత్ర ప్రదేశాల్లో ఒకటైన మన నడిగడ్డ యొక్క పవిత్రను దృష్టిలో పెట్టుకొని శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తమ ప్రపంచ శాంతి, మానవావలి అభ్యున్నతి కోసం , ఈ ప్రాంత ప్రజల సౌభాగ్యం కోసం శ్రీ కృష్ణ పరమాత్మ ఆదేశానుసారం నడిగడ్డ లోని గద్వాల ప్రాంతంలో ఈ మహా యాగాన్ని తలపెట్టడం మన ప్రాంతం చేసుకున్న అదృష్టం.. అని ఈ యాగ మహత్యం వల్ల ఈ ప్రాంతం సస్యశ్యామలమై మన ప్రాంత ప్రజలు ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటూ జరుగుతున్న మహా యజ్ఞంలో భాగస్వాములవడం మన అదృష్టంగా భావించి లిఅన్ని గ్రామాలు,వాడలు నుంచి పెద్ద ఎత్తున ఇటువంటి బృహత్ కరమైన కార్యక్రమంలో మీరందరూ మీ గ్రామ ప్రజలతో పాల్గొని విజయవంతం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. స్వామిజీ ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గం లో ప్రజలందరూ దిన దిన అభివృద్ధి చెందాలి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు సుఖసంతోషాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# తెల్లదొరల గుండెల్లో వణుకు పుట్టించిన ధీరుడు వడ్డే ఓబన్న

### మూసాపేట్ డివిజన్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్

**కూకట్ పల్లి, జనవరి 11 (ప్రభాత ఉదయం)**

స్వాతంత్ర పోరాట సమయంలో తెల్లదొరలను గడగడలాడించి వారి గుండెల్లో వణుకు పుట్టించిన ధీరుడు వడ్డెరల ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న అని మూసాపేట్ డివిజన్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్ జనతా నగర్ లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, సంఘం ప్రతినిధులు నర్సింహా, బందప్ప, మైసయ్య, సత్తయ్య, సాయిలు, రాజు, నాగేష్, ఇనుగంటి రాజు, గోపాల్, శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నారం కేసీఆర్ కాలనిలో రంగవల్లుల పోటీలు

**పటాన్ చెరు, జనవరి 11 (ప్రభాత ఉదయం):**

సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలో భాగంగా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని కేసీఆర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. కాలనీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి అక్షయ సరళ,రెండవ బహుమతి సోనాలి,మూడవ బహుమతి మంజుల, ప్రీతిలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకట్ రెడ్డి,సుకువర్ధన్ రెడ్డి,నగేష్, రాఘవ రెడ్డి, బాను చందర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు



# బొల్లారం డివిజన్‌లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రేనాటి స్వాతంత్ర్య సమర యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

**పటాన్ చెరు, జనవరి 11 (ప్రభాత ఉదయం):**

ఓబన్న చూపిన మార్గంలో యువత పయనించాలని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని బొల్లారం డివిజన్ పరిధిలోని ఐడిఎ కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు ఘన నివాళులు వేసి అర్పించారు. ఆయన త్యాగాలు భావి తరాలకు స్ఫూర్తినిచ్చేలా ప్రాచుర్యం చేయాలని అందరికీ ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో వడ్డెర సంఘానికి చెందిన పలువురు నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జనసేన విద్యార్థి విభాగం అడ్ హక్ సభ్యుడిగా పోతుల సిద్ద రాములు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను బలంగా తీసుకెళ్లే లక్ష్యంతో విద్యార్థి విభాగం కార్యకర్తలకు ట్రైనింగ్ కార్యక్రమం ఇవ్వడం తో పాటు జనసేన పార్టీ కిట్ అందిచడం జరిగింది . ఈ శిక్షణా కార్యక్రమంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రౌండ్ లెవల్‌లో చేయాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో అనుసంధానం వారధి గా పని చేయాలని కోరారు.తెలంగాణ జనసేన విద్యార్థి విభాగం అడ్ హక్ సభ్యుడిగా జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన పోతుల సిద్ద రాములు చోటు కల్పించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి చేతుల మీదుగా అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను బలంగా తీసుకెళ్లే లక్ష్యంతో విద్యార్థి విభాగం కార్యకర్తలకు ట్రైనింగ్ కార్యక్రమం ఇవ్వడం తో పాటు జనసేన పార్టీ కిట్ అందిచారు . ఈ శిక్షణా కార్యక్రమంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రౌండ్ లెవల్‌లో చేయాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో అనుసంధానం వారధి గా పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రమణ స్వామి నాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు నంబర్ మహేందర్ రెడ్డి, తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ కావ్య, జోగులాంబ గద్వాల్ జిల్లా జనసేన నాయకులు జమ్మన్న, రఘు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608